# ఎవరు?

- సి.ఎన్.చంద్రశేఖర్

ఉగాది పోటీలో ఎంపికైన కథ

ఫోను రింగవడం విని మంచం మీదినుంచి లేచి రిసీవరు అందుకున్నాడు వినయ్.

"హలో"

"... ..."

"అలాగా. నేనిప్పుడే బయలుదేరి వస్తున్నాను."

రిసీవరు క్రెడిల్ మీద ఉంచి తన యూనిఫాం అందుకున్నాడు.

"ఏమిటండీ. ఎక్కడి నుంచి ఫోను?" అతని భార్య వసుమతి అడిగింది.

"ఖైరతాబాదులోని కీర్తన అపార్ట్‌మెంట్స్‌లో ఓ అమ్మాయి హత్య చేయబడింది."



"మీరు వెళ్ళే తీరాలా? అసలే నాన్నగారు ఊరికి బయలుదేరినప్పటినుండీ ఒంటరితనంవల్ల మనసంతా ఏదోలా ఉంది. ఇప్పుడు మీరూ వెళ్తే నేను పిచ్చిదాన్నయిపోతాను. మీ బదులు యింకెవరినన్నా పంపలేరా?" అభ్యర్థనగా అడిగింది.

ఆమెను అలా చూస్తుంటే అతనికి జాలేసింది. వాళ్ళ పెళ్ళయి ఆరు నెలలు కూడా కాలేదు. ఆమె కాపురానికి వచ్చి రెండు నెలలు కావస్తూంది. అయితే పోలీసు ఉద్యోగంలో ఉండే యిబ్బందులు పెళ్ళిచూపులనాడే ఆమెకు విశదపరిచాడు. వినయ్ అందం, చురుకుదనం చూడటంవల్ల, అతని మంచితనం గురించి విని ఉండటంవల్ల మరో ఆలోచన లేకుండా వెంటనే పెళ్ళికి ఒప్పుకుంది. వినయ్ కూడా ఆమెని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. కాకపోతే వారానికి ఒకటి రెండుసార్లు యిలా రాత్రివేళల్లో బయటకు వెళ్ళాల్సి వస్తూంది. ఇన్నాళ్ళు వసుమతి తండ్రి తమతో ఉండటంవల్ల పెద్దగా యిబ్బంది అనిపించలేదు. కానీ యీరోజు తండ్రి కూడా ఊరికి వెళ్ళడంతో ఆమె మరింతగా ఒంటరితనం ఫీలౌతూంది.

"వసూ. అదెలా వీలవుతుంది. మా స్టేషన్ పరిధిలో జరిగింది కాబట్టి నేను వెళ్ళి తీరాలి. వీలైనంత త్వరగా వచ్చేస్తానుగా. ప్లీజ్" అనునయంగా అన్నాడు.

వినయ్ వెళ్ళాక తలుపు గడియ వేసుకుని మంచంపై కూర్చుని ఆలోచిస్తూ ఉండిపోయింది. పది నిమిషాల తర్వాత ఫోన్ మ్రోగడంతో ఉలిక్కిపడి రిసీవరు అందుకుంది.

"నేనమ్మా" తండ్రి గొంతు వినిపించడంతో ఆమెకెంతో ధైర్యం వచ్చింది.

"మీరా నాన్నా. క్షేమంగా యిల్లు చేరారా?"

"ఇప్పుడే చేరానమ్మా. దార్లో బస్సు బ్రేక్‌డౌను అయింది. రెండు గంటలు ఆలస్యమైంది. వాసు, లలిత ఎంతో సంతోషపడ్డారు నన్ను చూసి. ఇక యిల్లు కదిల్తే ఒప్పుకోరట. నన్ను చూడాలనిపిస్తే నువ్వే వరంగల్ రావాలట."

"అవునవును. మీరు వాడికొక్కడికే తండ్రి కాదని చెప్పండి. వదిన బాగుంది కదా?"

"బాగుందమ్మా. అల్లుడుగారున్నారా?"

"లేరు నాన్నా. మన యింటికి దగ్గర్లోనే కీర్తన అపార్ట్‌మెంట్స్‌లో ఓ అమ్మాయి హత్య చేయబడిందట. ఫోనొస్తే యిప్పుడే వెళ్ళారు."

"అలాగా. జాగ్రత్తమ్మా. తలుపులు లాక్ చేసి పడుకో. నీకు భయం అనిపించినప్పుడల్లా నాకు ఫోన్ చేస్తూండు. నాకెటూ అంత త్వరగా నిద్ర పట్టదు. నాతో మాట్లాడుతూంటే అంతగా భయం అనిపించదు నీకు."

"అలాగే నాన్నా."

ఫోన్ పెట్టేసి మంచం మీద పడుకుంది. కాసేపటికే ఆమెకు నిద్రాదేవి ఆవహించింది.

* * *

కాలింగ్ బెల్ శబ్దం విని నిద్ర లేచింది వసుమతి. లైటు వేసి టైము చూసింది. మూడు గంటలు చూపిస్తూంది గడియారం. వినయ్ గొంతు విని, కిటికీ లోంచి అతన్ని చూశాక తలుపు తెరిచింది.

అతను బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్నాడు. అతని కళ్ళు నిద్రలేమిని సూచిస్తున్నాయి.

"పాలున్నాయా?" షూస్ విప్పుతూ అడిగాడు.

"కాఫీ చేసివ్వనా?"

యివ్వమన్నట్టు తలూపాడు. కాఫీ త్రాగాక

"వసూ. హత్య చేయబడిన ఆ అమ్మాయి ఎవరో తెలుసా?" అని అడిగాడు.

ఎవరన్నట్టు చూసింది.

"ఆశ."

"ఏ ఆశ?"

"మన బిల్డింగ్‌లోని రామారావుగారమ్మాయి ఆశాలత."

"మైగాడ్" అంటూ సోఫాలో కూలబడిపోయింది వసుమతి. తర్వాత "అయ్యో. ఇప్పుడెలాగండీ. వాళ్ళెలా తట్టుకోగలరండీ? ఇంతకూ విషయం చెప్పారా వాళ్ళకి?"అని అడిగింది.

"చెప్పలేదు. నేరుగా మనింటికే వచ్చాను. వాళ్ళకు షాక్ కలగకుండా మెల్లగా విషయం చెప్పాలి. నువ్వూ నాతోపాటు రా. వాళ్ళను ఓదార్చడానికి ఓ మనిషుండాలి యిప్పుడు."

"పదండి. నేను వస్తాను."

తలుపు తాళం వేసి అతన్ని అనుసరించింది వసుమతి.

* * *

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలి. ఈ సమయంలో అడగడం భావ్యం కాదు. కాని నా విధి నిర్వహణలో యిది తప్పనిసరి. పైగా హంతకుడిని త్వరగా పట్టుకోవాలంటే మిమ్మల్ని యిబ్బంది పెట్టక తప్పదు. మీ యింట్లో బంధుజనం ముందు మీరు యిబ్బంది పడకూడదని మా యింటికి పిలిపించాను" వినయ్ రామారావుతో అన్నారు.

"ఫర్వాలేదు అడగండి".

"మీ అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్స్ ఎవరైనా ఉన్నారా?"

"సంతోష్ అని ఓ అబ్బాయి ఉన్నాడు. ఇద్దరూ ప్రేమించుకున్నామని నాలుగు రోజుల క్రితం యింట్లో చెప్పింది. అతనిది మా కులం కాదు. పైగా ఆశ చదువు యింకా పూర్తికాలేదు. అందువల్ల నేనూ, నా భార్యా అభ్యంతరం చెప్పాం. ఆమె మనసు మార్చుకోమని నచ్చచెప్పాం. ప్రతి విషయంలోనూ మా మాట పాటించే ఆశ యీ విషయంలో మాత్రం మాకెదురు తిరిగింది. అతన్ని విడిచి బ్రతుకలేనంది. చావనైనా చస్తాను గాని యింకొకర్ని పెళ్ళి చేసుకోనంది. నెమ్మదిగా మారుతుందని మేము ఆ విషయాన్ని తర్వాత ఆమెవద్ద ప్రస్తావించలేదు. నిన్న సాయంత్రం యింటికి రాకపోయేసరికి మాకు అనుమానం వచ్చి అతని సెల్‌కు ఫోన్ చేశాను. లైను దొరకలేదు. ఇద్దరూ కలసి ఊరు విడిచి వెళ్ళిపోయి ఉంటారని నాకు అనుమానమొచ్చింది. రెండురోజులు ఆగి చూసి పోలీస్ కంప్లైంట్ యిద్దామనుకున్నాను. మీతో మాత్రం మరుసటిరోజు ఉదయం విషయం చెప్పి మీ సలహా తీసుకుందామనుకున్నాను. అంతలో మీరే వచ్చి ఈ కబురు చెప్పారు."

"హత్య జరిగిన రోజు సాయంత్రం" ఆశాలతను కాలేజీనుంచి ఎవరైనా వచ్చి తమతో పిలుచుకెళ్ళారా అని ఆమె స్నేహితురాళ్ళను అడిగాను. ఎవరూ రాలేదని, ఎప్పటిలాగే సిటీబస్ ఎక్కి వెళ్ళిందని ఆమె స్నేహితురాళ్ళు చెప్పారు. అయితే కాలేజీ నుంచి నేరుగా యింటికి రావలసిన పిల్ల మధ్యలో బస్సు దిగి ఆ అపార్ట్‌మెంట్‌కు ఎందుకు వెళ్ళిందో, ఎవరు తీసుకెళ్ళారో తెలిస్తే యీ కేసు సాల్వ్ అవుతుంది."

"ఆ అపార్ట్‌మెంట్లో వాచ్‌మన్‌ని అడిగితే వివరాలు తెలుస్తాయేమో?"

"అడిగాను. ఆ అపార్ట్‌మెంట్ ఓ సాఫ్ట్‌వేర్ యింజనీరుది. ఈమధ్యనే అతను అమెరికాకు వెళ్ళాడు. ఆరు నెలల్లో తిరిగి వస్తాడు కాబట్టి ఇంటిని ఎవరికీ అద్దెకు యివ్వలేదు. ఆ ఇంటి తాళంచెవులు అతనివద్దే ఉన్నాయి. ఆ ఫ్లోర్‌లో రెండు ఫ్లాట్లు మాత్రం ఉన్నాయి. రెండో ఫ్లాటులో ఉన్న వాళ్ళు పెళ్ళికి ముంబయి వెళ్ళారు. ఎల్లుండి వస్తారు. మీ అమ్మాయి లిఫ్ట్ ఎక్కుతుండగా వాచ్‌మన్ చూడలేదు. అనుమానించతగ్గ వ్యక్తులు కూడా ఎవరూ కనిపించలేదన్నాడు. బహుశ అతను బాత్‌రూమ్‌కు వెళ్ళినప్పుడో, బయటకు వెళ్ళినప్పుడో వీళ్ళు ఆ యింట్లోకి ప్రవేశించి ఉంటారు."

"ఇంతకూ... ఆశ... రేప్... చేయబడిందా?"

అడగలేక అడుగుతున్నట్లు ఉంది అతని కంఠం.

"లేదు. అటెంప్ట్ జరిగినట్లు గుర్తులున్నాయి. తనను గుర్తిస్తుందని భయపడి ఆమెను అంతం చేశాడు దుండగుడు."

అతను ఏడుస్తున్నాడు. వినయ్ అనునయంగా అతని భుజంపై చేయి వేసి "సార్. ఏడవకండి. ప్లీజ్" అన్నాడు.

అతను కన్నీళ్ళతోనే బయటకు నడిచాడు.

* * *

తనకెదురుగా నిలబడి ఉన్న ఆ కుర్రాణ్ణి కూర్చోమని సంజ్ఞచేశాడు వినయ్. అతను సన్నగా పొడవుగా ఉన్నాడు. చామనఛాయ కంటే రంగు కాస్త తక్కువే. అతని ముఖంలో ఆందోళన, భయం స్పష్టంగా కనిపిస్తూంది.

"నీ పేరు?"

"సంతోష్."

"ఆశాలతతో నీకెలాంటి స్నేహం?"

అతను తటపటాయించడం చూసి "నిజం చెబితే నీకే మంచిది. ఒక్క అబద్ధం చెప్పినా నీ అంతట నువ్వే యీ కేసులో యిరుక్కుపోతావు" అన్నాడు కఠినంగా చూస్తూ.

"నేనూ, ఆశాలత ప్రేమించుకున్నాం. మా ఇంజనీరింగు పూర్తయి నాకు ఉద్యోగం దొరకగానే పెళ్ళిచేసుకోవాలని అనుకున్నాం. ఆమె యింట్లో యీ విషయంలో వ్యతిరేకత ఎదురైందని చెప్పింది. నిన్న ఆమె మరణవార్త తెలియగానే ఆత్మహత్య చేసుకుందేమోనన్న అనుమానం వచ్చింది నాకు. కాని హత్య చేయబడిందంటే యిప్పటికీ నాకు నమ్మబుద్ధేయడం లేదు".

"మొన్న సాయంత్రం నీవెక్కడున్నావు?"

"చెన్నైలో ఉన్నాను. నిన్న ఉదయం రాగానే ఆశ చనిపోయిన వార్త తెలిసింది. తట్టుకోలేకపోయాను. అలాగే ఆమె యింటికి పరుగెత్తాను. అప్పటికి బాడీ యింటికి రాలేదని తెలిసి తిరిగి యింటికి వెళ్ళిపోయి సాయంత్రం వచ్చి చూశాను"అంటూ ముఖం చేతుల్లో దాచుకుని ఏడవసాగాడు.

అతను నిజంగా ఏడుస్తున్నాడో లేక ఏడుపు నటిస్తున్నాడో వినయ్‌కు అర్థంకాలేదు.

"నువ్వు చెన్నై ఎందుకు వెళ్ళావు?" అని అడిగాడు అతన్ని.

"ఆఫ్ క్యాంపస్ యింటర్వ్యూ కోసం."

"టిక్కెట్టుందా?"

"బస్సులో వచ్చాను. టిక్కెట్టు పారేశాను."

"కాల్ లెటర్?"

"ఆఫ్ క్యాంపస్ యింటర్వ్యూకు కాల్ లెటర్లుండవు."

"ఏసీ. నీ నలుగురు ఆప్తమిత్రుల పేర్లు, ఫోన్ నెంబర్లు ఈ కాగితంలో రాసివ్వు." అతను రాసిచ్చాక "వీళ్ళంతా మొన్న సాయంత్రం ఎక్కడ ఉన్నారో తెలుసా?" అని అడిగాడు.

"దినేష్ నాతోపాటు చెన్నై వచ్చాడు. మిగిలిన వాళ్ళు సిటీలోనే ఉన్నారు. వాళ్ళకు ఆశతో పరిచయం లేదు."

"సరే. ఇక నీవు వెళ్ళొచ్చు. రేపు నీ ఫొటో ఒకటి నాకిచ్చి వెళ్ళు. నేను ఎప్పుడు పిలిపించినా నువ్వు వచ్చి కనబడాలి. ఊరు వదలి వెళ్ళే అవసరం వస్తే నాతో చెప్పి వెళ్ళాలి."

"అలాగే సర్" వినయంగా అని సెలవు తీసుకున్నాడు సంతోష్.

* * *

ఉస్మానియా హాస్పిటల్‌లో ఐ.సి.యు వార్డులో ఉన్న ఆ పేషెంట్‌ను చూసి బయటకు వచ్చిన వినయ్ తనతో ఉన్న ఎస్.ఐతో "ఏమిటి కేసు?" అని అడిగాడు.

"ఇతని పేరు గోవిందయ్య. భార్య ఏడాది క్రితం చనిపోయింది. అప్పట్నుంచీ ప్రక్కింటివాడి భార్యతో సంబంధం పెట్టుకున్నాడు. ఆమె భర్త యీరోజు యితన్ని కత్తితో పొడిచి పారిపోయాడు."

"ఎఫ్.ఐ.ఆర్. రాశారా?"

"రాశాం సార్. ఇతను బ్రతకడం కష్టమేనంటున్నారు డాక్టర్లు."

ఇంతలో వినయ్ సెల్ మ్రోగడంతో సెల్ ఆన్ చేసి "హలో"అన్నాడు.

"హలో వినయ్. కమీషనర్ ఆఫీసునుంచి సిన్హాను మాట్లాడుతున్నాను. 'కీర్తన అపార్ట్‌మెంట్స్'లో హత్యకు గురైన అమ్మాయి కేసులో ఏదైనా లీడ్ దొరికిందా."

"ఇంకా లేదు సార్. ఎంక్వయిరీలన్నీ దాదాపు పూర్తి చేశాం. హత్య జరిగిన ఫ్లాటు ఖాళీగా ఉన్న విషయం ఆ అపార్ట్‌మెంట్‌కి తరచుగా వచ్చే వ్యక్తులకు మాత్రమే తెలిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఫ్లాటుకు ఎదురుగా ఉన్న ఫ్లాటుకు వచ్చే వ్యక్తికి. ఆ యింట్లోని వారు ఊరికెళ్ళారు. ఈరోజు సాయంత్రం తిరిగొస్తారు. వాళ్ళను విచారిస్తే ఏదైనా క్లూ దొరకవచ్చు."

"మిగిలిన ఫ్లాట్స్‌లో ఉండేవాళ్ళకు కూడా ఆ ఫ్లాటు ఖాళీగా ఉన్న విషయం తెలిసుంటుంది. ఆ దిశగా ఎంక్వయిరీ చేశారా?"

"చేశాం సార్. అందరికీ ఎలిబీలున్నాయి. పైగా అందరూ డీసెంట్ ఉద్యోగాల్లో ఉన్నారు. పెళ్ళైనవాళ్ళు కూడా."

"అసలు దోషి దొరికేవరకూ ప్రతి ఒక్కడూ అనుమానితుడే వినయ్."

"మీరన్నది నిజమే సార్. నాకు అనుమానమొచ్చిన ప్రతి ఒక్కరి మీదా నిఘా ఉంచాను. ఆ బిల్డింగ్ వాచ్‌మేన్ మీదా నాకు అనుమానముంది. అతను నిందితుడికి సహాయం చేసి ఉండొచ్చు. అలాగే ఆశాలత ప్రియుడు సంతోష్. అతని స్నేహితుల మీద కూడా అనుమానముంది. వీళ్ళు త్రాగుబోతులని, చదువును నిర్లక్ష్యం చేస్తూ ఆడ పిల్లల వెనుక జులాయిల్లా తిరుగుతున్నారని వారి యిరుగుపొరుగువాళ్ళు చెప్పారు. వాళ్ళ కదలికలపై కూడా నిఘా ఉంచాను."

చెన్నైలో ఉన్నాను. నిన్న ఉదయం రాగానే ఆశ చనిపోయిన వార్త తెలిసింది. తట్టుకోలేకపోయాను. అలాగే ఆమె యింటికి పరుగెత్తాను. అప్పటికి బాడీ యింటికి రాలేదని తెలిసి తిరిగి యింటికి వెళ్ళిపోయి సాయంత్రం వచ్చి చూశాను

"వీలైనంత త్వరగా యీ కేసు సాల్వ్ చేయాలి వినయ్. కమీషనర్‌గారు చాలా కన్సర్న్ చూపిస్తున్నారు ఈ కేసుపైన. మహిళా సంఘాల ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంది."

"తప్పకుండా సార్. ఓ పోలీసాఫీసరు గానే కాకుండా ఓ మనిషిగా కూడా అది నా బాధ్యత. త్వరలోనే హంతకుణ్ణి పట్టుకుంటాను."

"వెరీ గుడ్. ఆల్ ది బెస్ట్."

* * *

హత్య జరిగిన ఫ్లాటు ఎదురు ఫ్లాటులో నివసిస్తున్న ఫ్యామిలీ ఊరి నుంచి వచ్చారని తెలిసి వాళ్ళింటికి వెళ్ళాడు వినయ్. ఆ యింట్లో ఓ వృద్ధ దంపతులు, వారి కుమారుడు, కోడలు నివసిస్తున్నారు. తాము యీ ఊరికి వచ్చి మూడు నెలలే అయిందని, హాయిగా రోజులు గడచిపోతూంటే యీ హత్య జరగడం దురదృష్టకరమని, విషయం విని తాము భయభ్రాంతులయ్యామని చెప్పారు వాళ్ళు. అనుమానించదగ్గ వ్యక్తులెవరూ తమ యింటికి రాలేదని చెప్పారు. వినయ్ తన విజిటింగ్ కార్డ్ వాళ్ళకిచ్చి ఏదైనా క్రొత్త విషయం వాళ్ళకు తోచినా లేదా వాళ్ళ దృష్టికి వచ్చినా తనకు ఫోన్ చెయ్యమని చెప్పి బయలుదేరాడు.

విజిటింగ్ కార్డు చూసిన కోడలు "మీరు వసుమతి భర్త కదూ?" అని అడిగింది.

"అవును. మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు వినయ్.

"వసుమతి నాకు బంధువవుతుంది."

* * *

"సార్. ఉస్మానియాలో ఉన్న పేషెంట్ నుంచి మరణ వాంగ్మూలం తీసుకోమని ఫోనొచ్చింది. యస్.ఐ.గారు యింకా రాలేదు. మీకు ఫోన్ చేద్దామని అనుకుంటూంటే మీరే వచ్చారు" హెడ్ కానిస్టేబుల్ చెప్పాడు వినయ్‌తో.

"మనం వెళదాం పదండి."

పది నిమిషాల్లో హాస్పిటల్ చేరారు.


గోవిందయ్య అతి కష్టంమీద మాట్లాడుతున్నాడు.

"నాకు మొదట్నుంచీ శృంగార పరమైన కోరికలు ఎక్కువ. అందుకే ఉద్యోగం రాగానే పెళ్ళిచేసుకున్నాను. నాకు యాభై ఏళ్ళు వచ్చేవరకూ సంసార జీవితం సుఖంగా సాగింది. గత ఏడాది నా భార్య మరణించింది. కొద్ది రోజుల తర్వాత నాకు పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన వచ్చింది. కాని ఈమధ్యనే నా కూతురికి పెళ్ళయింది. అమ్మాయి, అల్లుడు ఏమైనా అనుకుంటారేమోనన్న అనుమానంతో ఆ ప్రయత్నం మానుకున్నాను. కాని నాలో కోరికలు చావలేదు. అందుకే ప్రక్కింటి అంబుజకు దగ్గరయ్యాను. ఆమె భర్త సన్నగా ఉంటాడు. నోట్లో నాలుక లేనివాడు. వాడు నన్నేం చేస్తాడులే అనుకున్నాను. నేను నిద్రపోతున్నప్పుడు అతను తన పగ తీర్చుకున్నాడు. ఇప్పుడనిపిస్తుంది ఎవరేమనుకుంటే నాకేం అనుకుని నాకు తగ్గ వ్యక్తిని చూసి పెళ్ళిచేసుకుని ఉంటే నైతికంగా తప్పు చేస్తున్నానన్న ఫీలింగ్ నాలో ఉండేది కాదు. (మిగతా 12వ పేజీలో)

# చరిత్ర జరీ అంచు గద్వాల కోట

కర్నూలు నుంచి 60 కిలోమీటర్ల దూరంలో వున్న గద్వాల పేరు వినగానే ఎవరికైనా జరీ అంచు గద్వాల చీరలే గుర్తుకు వస్తాయి. నిజానికి గద్వాల 17వ శతాబ్దంలో నిజాం పాలనలో ఏర్పాటైన వరంగల్, మెదక్, ఔరంగాబాద్, గుల్బర్గా సుబాలలో, గుల్బర్గాలోని రాయచూరు జిల్లాలోని సంస్థానాలలో ఒకటిగా వుండేది.

క్రీ.శ.1650లలో కృష్ణ, తుంగభద్ర నదుల మధ్యనున్న దరూర్ మొదలైన ప్రాంతాలలోని మహళ్ళకు అయిజగ వ్యవహరించిన వీరారెడ్డి వంశస్థులు నిర్మించిన కోట, ఆ కోట ప్రాంగణంలో కొలువై వున్న చెన్నకేశవస్వామి ఆలయాలకు ప్రసిద్ధిచెందిన సంస్థానం గద్వాల. వీరారెడ్డికి పుత్ర సంతానం లేనందువల్ల అల్లుడికే అతడి తర్వాత నాడగౌడీకం కట్టబెట్టటం జరిగిందని, అతడి పుత్రులైన ఆనందగిరి, సోమగిరిలలో సోమగిరి సోమనాద్రిగ, పెద సోమ భూపాలుడిగ పేరుపొంది క్రీ.శ.1704లో అధికారం చేపట్టినాడని, అతడి హయాంలోనే గద్వాల కోట నిర్మాణం జరిగిందని తెలుస్తుంది.



వీరి కొలువులో ఎందరో తెలుగు కవులు సాహిత్యకారులు ప్రోత్సాహం పొందారు. వారిలో పెదసోమభూపాలుడి కాలంలో కొటికపూడి వీరరాఘవయ్య, పూడూరి క్రిష్ణయ్య పేర్లను ప్రముఖంగా చెప్పుకుంటే, పెద సోమన్న మరణానంతరం (క్రీ.శ.1711) అతడి పుత్రులు చిన్నవారవటంవల్ల ముందుగా సోమన్న భార్యలు తదనంతరం పెద్ద కొడుకు తిరుమలయ్య సంస్థానపు వ్యవహారాలను నడిపారు. ఇతని పుత్రులైన చిన సోమన్న, చిన రామన్నలతో, చిన రామన్న క్రీ.శ.1747లో విద్యాభ్యాసంతోబాటు సైనిక వ్యవహారాలలోనూ ఆరితేరి క్రీ.శ. 1762లో రాజ్యభారం స్వీకరించాడు.

గద్వాల సంస్థానాధీశులలో తిరుమలయ్యకు మంచి సాహిత్యాభిలాష వున్న వ్యక్తిగా గుర్తింపు వున్నా చిన సోమన్న కాలం గద్వాల చరిత్రలో స్వర్ణ యుగంగా గుర్తింపు పొందింది. 'యాజ్ఞవల్క్య చరిత్ర', 'కుచేలోపాఖ్యానం' వంటి రచనలు చేసినట్టు చెప్పబడే యట్టు శేషయ్య ఇతడి సమకాలీనుడు. గొప్ప తత్వవేత్తగా, న్యాయ సిద్ధాంత కోవిదుడిగా, స్మృతికారుడిగా పేరుపడిన యాజ్ఞవల్క్యుడి చరిత్రను గుర్తుకు తెచ్చుకున్న ఈ గద్వాల సంస్థాన యుగ చరిత్రనూ, గద్వాల కోటనూ మరవటం అన్నది సాధ్యం కాదేమో!

అయితే, గద్వాల కోట ముఖ్య ప్రవేశ ప్రాకార ద్వారం, కోట లోపలి చాలా భాగాలు పూర్తిగా శిథిలం అయినట్టే అనిపిస్తాయి. అయినా కూడా పైకప్పుకు కూడా చెక్కనే ఉపయోగించి చేపట్టిన నిర్మాణ శైలి; కోట వెనక భాగాన చెన్నకేశవస్వామి ఆలయానికి సమీపంలో వున్న దిగుడు బావి; కూలిన గోడలూ గత కాలవైభవపు చిహ్నాలే అని చెప్పకనే చెబుతాయి. చెన్నకేశవస్వామి ఆలయ ప్రాకారం ఒకింత దెబ్బతిన్నా, ఆలయ గోపుర ప్రాకార ద్వారం, ద్వారం ఎదురుగా అతి సామాన్యంగా అనిపించే ముఖ్యాలయం, ముఖ్యాలయంకు ఇరువైపులా విజయనగర కాలపు శిల్పశైలిని జ్ఞప్తికి తెచ్చే విధంగా శిల్పమయ స్థంభ మండపాలంకృత ఉపాలయాలూ ఈనాటికీ చెక్కుచెదరకుండా వున్నాయి. ఆలయ నిర్మాణ శైలిని గమనించినట్టయితే, గద్వాల ప్రభువుల ఏలుబడిలో వేర్వేరు కాలాలలో ఈ నిర్మాణాలు జరిగి వుండవచ్చునన్నది స్పష్టం అవుతుంది.

గద్వాల సంస్థానాధీశుల ఇలవేల్పు చెన్నకేశవ స్వామి.

ఈనాటికీ ఉభయ సంధ్యలలో ఈ ఆలయంలో పూజలు అర్చనలు నిర్విఘ్నంగా కొనసాగించబడుతూ వున్నాయి.

**- ఉషా లావణ్య**

---

*(9వ పేజీ తరువాయి)*

ఇలా అర్థాంతరంగా చచ్చే పరిస్థితి వచ్చేది కాదు కదా అని."

అతని మాటలు ఆగిపోయాయి. వినయ్ ఆలోచనలు కూడా ఓ చోట ఆగిపోయాయి.

* * *

"సార్. రఘు స్టూడియోనుంచి మీకోసం ఎవరో వచ్చారు. మీరు బయటికెళ్ళారని చెప్తే యీ కవరు మీకిమ్మని చెప్పారు" కానిస్టేబుల్ చెప్పాడు వినయ్‌తో.

వినయ్ కవరు అందుకుని డ్రాలో పెట్టి, తన ఎదురుగా నిలబడ్డ అతన్ని పరీక్షగా చూశాడు. లావుగా, పొట్టిగా ఉన్నాడతను.

"కీర్తన అపార్ట్‌మెంట్స్‌లో సి-టూ ఫ్లాటు తాళాలకు మారు తాళాలు తయారుచేసింది యితనేనట సార్" కానిస్టేబుల్ చెప్పాడు.

"నీ పేరు" వినయ్ అడిగాడు.

"చంద్రయ్య."

"నువ్వేనా ఆ యింటి తాళాలు తెరిచింది."

"అవును సార్."

"ఎవరు తెరవమన్నారు నిన్ను?"

"ఎవరో ఓ వ్యక్తి తన యింటి తాళం చెవులు పోగొట్టుకున్నానని, తాళం వేసి డూప్లికేటు తయారుచేసివ్వమని అడిగాడు. అలాగేనని అతనితో వెళ్ళి అతను చెప్పిన పని చేశాను. వంద రూపాయలిచ్చాడు."

"నువ్వు అటువంటి పని చేస్తున్నప్పుడు యిరుగుపొరుగు వాళ్ళ దృష్టి నీమీద పడేలా చూసుకోవాలి. అప్పుడు అతను నిజంగా ఆ యింట్లో నివసించే వ్యక్తేనా కాదా అన్న విషయం నిర్ధారణ అవుతుంది. నీవు ఆ పని చేయనందువల్ల ఓ అమాయకురాలు బలైంది. ఆ వ్యక్తి ఎలా ఉన్నాడు? వయసెంత ఉంటుంది?" అన్నాడు వినయ్.

"వయసు నలభై దాటి ఉంటుంది. చూడ్డానికి కుర్రాడిలాగే ఉన్నాడు. లిఫ్ట్ పనిచేయడం లేదని మూడు మిద్దెల మెట్లు ఎక్కించాడు నన్ను. అతనూ మెట్లు ఎక్కలేక నానా హైరానా పడ్డాడు. ఉంగరాల జుట్టు, ఎర్రగా ముంబయి బాబులా ఉన్నాడు."

వినయ్ ఏదో గుర్తొచ్చిన వాడిలా తలాడించి, డ్రాలోంచి కవరు తీసి అందులోని ఓ ఫోటోని అతనికి చూపుతూ "ఆ వ్యక్తి యితనేనా చూడు" అన్నాడు.

అతని ముఖం ఆశ్చర్యంతో నిండిపోయింది.

"ఇతనే సార్. ఇతనే... మనిషి ఫోటోలో కంటే యింకా బాగుంటాడు."

* * *

"వినయ్‌గారూ. మీరు చెప్పిన అడ్రస్‌కు వెళ్ళి ఆ వ్యక్తిని అరెస్ట్ చేశాము. నేరం అంగీకరించాడతను" ఫోనులో వినయ్‌తో చెప్పాడు సి.ఐ. రఘుపతి.

"ఎందుకు చంపాడట ఆ అమ్మాయిని?"

"ఆ అమ్మాయి పట్ల యితను అభిమానం చూపేవాడట. ఆ అమ్మాయి తన పర్సనల్ విషయాలన్నీ ఇతనితో చెప్పుకునేదట. క్రమంగా ఆమె అంటే ఆసక్తి, ఆకర్షణ యితనికి కలిగిందట. ఆమెను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్ళి తన కోరిక చెప్పి, నచ్చజెప్పి ముగ్గులోకి దింపాలని నిర్ణయించుకున్నాడట. ఆ అమ్మాయి ఏదో సబ్జెక్టు కష్టమని ఫీలౌతూంటే తన ఫ్రెండు కూతురు ట్యూషన్ చెబుతుందని ఆ అపార్ట్‌మెంట్స్‌కి తీసుకెళ్ళి తన మనసులోని కోరికను వ్యక్తం చేశాడట. ఆమె ఛీదరించుకుంటే బలాత్కారం చేయబోయాడట. ఆమె అరవబోతూంటే చేయి ముఖం ముందు నొక్కి పట్టుకున్నాడట. శ్వాస ఆడక ఆ అమ్మాయి మరణించిందట."

బాధగా నిట్టూర్చాడు వినయ్.

'వినయ్‌గారూ. హైదరాబాదులో ఉన్న మీరు హంతకుడి అడ్రసు అంత ఖచ్చితంగా యింటికి వేసిన రంగుతో సహా ఎలా చెప్పగలిగారు?"

"ఆయన నా మామగారు కాబట్టి." ★